సాక్షి
వికారాబాద్

మంగళవారం : 16 : ఏప్రిల్ : 2024



ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

యాలాల మండలం జుంటుపల్లి రామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. 8లో▸



పల్లెపల్లెకూ సర్కారు వైద్యం

ప్రభుత్వం పల్లె, బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయడంతో సర్కార్ వైద్యం రోగులకు చేరువైంది. 9లో▸



సామాజిక తనిఖీ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ చేయనున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

తాండూరు రూరల్: తెలంగాణ – కర్ణాటక సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు ఆదేశించారు. సోమవారం మండలంలోని కోట్లాపూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కర్ణాటక నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీసులకు సూచించారు. సరైన పత్రాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తరలిస్తే సీజ్ చేయాలన్నారు. మద్యం సరఫరాపై కూడా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజిరెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

25న మామిడి చెట్లకు బహిరంగ వేలం

అనంతగిరి: వికారాబాద్ ప్రభుత్వ ఉద్యాన నర్సరీలోని మామిడి చెట్ల ఫలసాయం పొందేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా ఉద్యాన వన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సత్తార్ సోమవారం ఒక ప్రకటన తెలిపారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 11గంటలకు వేలం ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనేవారు 24 తేదీ సాయంత్రం 5గంటల లోపు రూ. 5వేలు డిపాజిట్ చేయాలని సూచించారు. వేలం పొందిన వారు పాట మొత్తంలో సగం నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని, అలా చెల్లించని ఎడల పాటను రద్దు చేసి రెండో వ్యక్తికి అనుమతి ఇవ్వడం జరుగుతుంది తెలిపారు. జూన్ 15వ తేదీ వరకు మామిడి పంటను పొందవచ్చని తెలిపారు. పంట లీజు కాలంలో చెట్లకు నష్టం వాటిల్లితే అట్టి నష్టాన్ని లీజు పొందిన వ్యక్తి నుంచి వసూలు చేయనున్నట్లు తెలిపారు. వేలం తేదీ నుంచి చెట్ల సంరక్షణ, నీటి యాజమాన్యం, కాపలా వంటివి పాటదారుడే చూసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అనుకున్న రేటు రాని వేళ వేలంను రద్దు చేసే అధికారం తమ శాఖకు ఉంటుందని తెలిపారు.

వాహన తనిఖీల్లో నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదుతో సీఐ

తాండూరు టౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఇందిరా చౌక్ వద్ద సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. తాండూరు మండలం సిరిగిరిపేట్‌కు చెందిన మద్దూరి అరవింద్ కుమార్ బైక్‌పై వెళుతుండగా ఆపి తనిఖీ చేయగా అతని వద్ద రూ.1.50 లక్షలు ఉండటంతో సీజ్ చేసినట్లు పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. ఈ మొత్తాన్ని కలెక్టరేట్‌లోని ట్రెజరీకి పంపడం జరిగిందని వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రూ. 50వేలకు మించి నగదు, పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలను తీసుకెళితే సీజ్ చేస్తామని తెలిపారు.

తాండూరుకు ఎన్నికల సామగ్రి



తాండూరు రూరల్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి సామగ్రి సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరాయి. పోలింగ్ సామగ్రి, స్టేషనరీ, బ్యాగులు, పింక్ బ్యాటిల్స్ వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

చేవెళ్ల అగ్నిమాపక కేంద్రం అధికారి భిక్షపతి

చేవెళ్ల: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల ఫైర్ స్టేషన్ అధికారి భిక్షపతి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఫైర్‌స్టేషన్ సిబ్బంది సోమవారం చేవెళ్ల బస్ స్టాండ్, మార్కెట్ యార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు అధైర్య పడకుండా కారణం తెలుసుకుని ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయని వాటి నివారణకు ప్రజలు ముందున్నగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశంలో ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండే వస్తువులు ఉంటే వాటిని ప్రమాద స్థలం నుంచి దూరం చేయాలన్నారు.

హస్తంలో విభేదాలు

లోక్‌సభ ఎన్నికల ముందు అంతర్గత కుమ్ములాటలు

- నువ్వెంత అంటే నువ్వెంత అనే వరకు గొడవలు
- తాండూరు, వికారాబాద్‌లో అధికం
- నాడు బీఆర్‌ఎస్‌లో.. నేడు కాంగ్రెస్‌లో..
- అధికార పార్టీ ఎమ్మెల్యేలకు తలనొప్పులు
- ఏ పార్టీలో ఉన్నా ఎంపీ రంజిత్‌రెడ్డికి తప్పని వర్గపోరు



వికారాబాద్: లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలు నేతలకు తలనొప్పిగా మారాయి. సొంత పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఎమ్మెల్యేలకు ఇబ్బంది కరంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కలిసికట్టుగా ఉన్న హస్తం పార్టీ నేతలు అధికారంలోకి రాగానే బస్తీమే సవాల్ అంటున్నారు. ఆ సవాల్ పక్క పార్టీ నేతలకు విసిరితే బాగానే ఉండేది.. కానీ సొంత పార్టీ నేతలపైనే విరుచుకుపడుతున్నారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ కాలర్ ఎగరేస్తూ కయ్యానికి కాలు దువ్వుతున్నారు. ప్రధానంగా తాండూరు, వికారాబాద్ మున్సిపల్ నేతల మధ్య ఈ గొడవలు తారాస్థాయికి చేరాయి. పరిగిలోనూ అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలు కనిపిస్తున్నాయి.

కాంగ్రెస్‌లోనూ రంజిత్‌కు తిప్పలే..

నిన్నమొన్నటి వరకు బీఆర్‌ఎస్‌లో ఉన్న ఎంపీ రంజిత్‌రెడ్డి ఆ పార్టీలో ఉన్న అంతర్గత కుమ్ములాటలతో విసిగిపోయారు. ఇటీవల ఆయన హస్తం గూటికి చేరినా ఇందులోనూ ఆ తలనొప్పులు తప్పడం లేదు. బీఆర్‌ఎస్‌కు బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ అంతర్గత పోరుతో గత అసెంబ్లీ ఎన్నికల్లో మూల్యం చెల్లించుకుంది. లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో నెలకొన్న వర్గపోరు రంజిత్‌రెడ్డి కొంప ముంచుతుందా..? అనే చర్చ మొదలయ్యింది.

తాండూరులో ముదిరిపోతున్న వర్గపోరు

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాటి నుంచే తాండూరు నియోజకవర్గంలో వర్గపోరు మొదలయ్యింది. ఇప్పుడు అది చిలికిచిలికి గాలి వానగా మారింది. పాత, కొత్త నాయకుల మధ్య సఖ్యత కుదరడం లేదు. వారి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇటీవల ఎమ్మెల్యే సమక్షంలో ఇరువర్గాల నేతలు తోపులాటకు దిగారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీనియర్ నేతలు కలుగజేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. కానీ ఇరువర్గాల మధ్య మనస్పర్థలు మాత్రం అలానే ఉండిపోయాయి. కాంగ్రెస్ పార్టీ తాండూరు పట్టణ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, ప్రస్తుత పట్టణ అధ్యక్షుడు సాజిద్ మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. ఇటీవల ప్రభాకర్‌గౌడ్, సంతోష్‌గౌడ్ అనే నాయకుడిని పార్టీలో చేర్పించేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు వచ్చాడు. పట్టణ అధ్యక్షుడిగా ఉన్న తనకు తెలియకుండా ఎలా చేర్చుకుంటారని సాజిద్ అడ్డుకోవడం ఇరువర్గాల మధ్య గొడవ తోపులాట వరకు వెళ్లింది.

వికారాబాద్‌లోనూ..

వికారాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డం ప్రసాద్‌కుమార్ మంత్రి పదవిపై ఆశలు పెట్టుకోగా ఈక్వేషన్లు కుదరక అనూహ్యంగా ఆయన సభాపతిగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయన నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీ లేకుండా వ్యవహరిస్తున్నప్పటికీ రాజకీయాల్లో, ప్రచారంలో నేరుగా పాల్గొనటం ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కసితో ప్రసాద్ గెలుపుకోసం పని చేసిన నాయకులు ఇప్పుడు ఆధిపత్య పోరుకు దిగుతున్నారు. తమ ప్రతాపం పక్క పార్టీలపై కాకుండా సొంత పార్టీ నేతలపైనే చూపిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడి మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు స్పీకర్‌కు తలనొప్పిగా మారింది. ఇటీవల రెండు మూడు సార్లు వారు నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఒకరిపై ఒకరు నోరు పారేసుకున్నారు. నువ్వెవడు నన్నడానికి అంటే నువ్వెవడు అనుకోవడం కాంగ్రెస్ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ వర్గపోరు లోక్‌సభ ఎన్నికల ముందు అటు చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఇటు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు తలనొప్పిగా మారింది. పరిగిలో కష్టపడిన తమకు ఇప్పటి వరకు ఎలాంటి నామినేటెడ్ పదవులకు రాలేదని నేతలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇటీవల ఓ మహిళా నాయకురాలు ఎమ్మెల్యే ముందే ఈ విషయాన్ని వెళ్లగక్కడం పార్టీలో చర్చకు దారితీసింది. ఎన్నికల వేళ నాయకుల తీరు ఇలా ఉంటే కష్టమేనని ఆ పార్టీ నేతలే అంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రేవంత్ మాటలు ప్రజలు నమ్మరు

- నరేందర్‌రెడ్డి లాంటి వారు నలుగురున్నా బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుంది
- పదేళ్లలో తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదు
- పాలమూరు – రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

కొడంగల్: సీఎం రేవంత్‌రెడ్డి మాయమాటలను కొడంగల్ ప్రజలు నమ్మే పరిస్థితులో లేరని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం కోస్గి పట్టణంలోని లక్ష్మీ నర్సింహా గార్డెన్స్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేసి ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మళ్లీ మోసం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలో ఉన్న పదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వలేదని విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కరివేన రిజర్వాయర్ పనులు పూర్తయ్యాయని, కాలువలు తవ్వితే కొడంగల్ నియోజకవర్గంలోని లక్షా 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రిజర్వాయర్‌ను పట్టించుకోకుండా కొడంగల్ రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డిని ఉద్దేశించి హరీశ్‌రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అన్న పార్టీని వీడి బీఆర్‌ఎస్‌కు మోసం చేస్తే తమ్ముడు నరేందర్ రెడ్డి మాత్రం కేసీఆర్‌కు బీఆర్‌ఎస్‌కు నమ్మిన బంటుగా ఉన్నారని కొనియాడారు. నరేందర్ రెడ్డి లాంటి నమ్మకస్తులు నలుగురు ఉన్నా బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థికి భారీ మెజారిటీ ఇవ్వాలన్నారు.

కాంగ్రెస్ ఓటమి ఖాయం

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందన్నారు. కాంగ్రెస్ ఓడిన మరుక్షణం నుంచి రేవంత్‌రెడ్డికి కష్టాలు ప్రారంభం అవుతాయని అన్నారు. సర్వేల ఆధారంగా కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశాలు లేవన్నారు. దీంతో రేవంత్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే దమ్ములు ఎవరికీ లేవని చెప్పిన రేవంత్‌రెడ్డి కొడంగల్ బహిరంగ సభలో మాత్రం తడబడ్డారని ఆరోపించారు. మహబూబ్‌నగర్‌లో హస్తం పార్టీ అభ్యర్థి గెలిచే పరిస్థితి లేదన్నారు. తుక్కుగూడలో రాహుల్ గాంధీ సమక్షంలో పార్లమెంట్ ఎన్నికలు కాంగ్రెస్ పాలనకు రెఫరెండమని చెప్పిన ముఖ్యమంత్రి రెండురోజులు తిరగకుండానే ఈనెల 8వ తేదీ కొడంగల్‌కు వచ్చి తనను ఓడగొట్టడానికి.. పడగొట్టడానికి కుట్రలు చేస్తున్నారని చెప్పడం చూస్తే కాంగ్రెస్ ఓటమి ఖాయమైనట్లు తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం దేవుళ్ల జపం

- కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు
- బీజేపీని ఎవరూ నమ్మే పరిస్థితి లేదు
- కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

షాద్‌నగర్: ధర్మం కోసం అందరూ రాముడిని పూజిస్తుంటే, ఓట్ల కోసం బీజేపీ వాడుకుంటోందని సీడబ్ల్యూసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. షాద్‌నగర్ పట్టణంలోని ఈడెన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం పార్టీ ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్ మున్సిపాలిటీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఓట్ల కోసం బీజేపీ కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కేంద్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉండి చేసిందేమీ లేదన్నారు. ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతున్న బీజేపీని ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. డీకే అరుణ ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియదని, త్వరలో ఎంఐఎంలో కూడా చేరొచ్చని ఎద్దేవా చేశారు. కేంద్రం నుంచి షాద్‌నగర్‌కు ఒక్క ప్రాజెక్టు తీసుకొచ్చినట్లు చూపించినా తాను నామినేషన్ కూడా వేయనని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి చేయడంలో విఫలమయ్యారని, ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చౌదరిగూడలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించారని పేర్కొన్నారు. త్వరలో కృష్ణా జలాలను షాద్‌నగర్‌కు తీసుకొచ్చి ఈ ప్రాంత ప్రజల కాళ్లు కడుగుతామన్నారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుపరిపాలన

- దేశాన్ని, ధర్మాన్ని కాపాడుతోంది మోదీనే
- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: దేశాన్ని, హిందూ ధర్మాన్ని కాపాడుతున్న ఏకైక నాయకుడు ప్రధాని మోదీనే అని, ఆయన యుగ పురుషుడని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని కొండా బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీకి ఎవరూ సాటిలేరన్నారు. మూడోసారి పీఎం కావడం ఖాయమన్నారు. గ్రామాలకు నేరుగా కేంద్రం నిధులు వస్తున్నాయని తెలిపారు. సీసీ రోడ్లు, పార్కులు, డంపింగ్ యార్డులు, రైతు వేదికలు, శ్మశాన వాటికలు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మించినట్లు వివరించారు. కరోనా కాలం నుంచి నేటి వరకు పేదలకు ఉచితంగా బియ్యం ఇస్తున్నట్లు గుర్తు చేశారు. సుపరిపాలన బీజేపీతోనే సాధ్యమన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి, రూ. 2లక్షల రుణమాఫీ అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఐదేళ్ల ఎంపీగా ఉన్నా ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. ఈ సారి ఆయన ఓటమి ఖాయమన్నారు. తనను ఆశీర్వదించాలని కోరారు.

హ్యాట్రిక్ విజయం సాధిస్తాం: మాధవరెడ్డి

లోక్‌సభ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. అన్ని సర్వేలు తమకు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి 400పైగా సీట్లు వస్తాయని, కాంగ్రెస్ 50 సీట్లకు మించి రావన్నారు. ఎన్నికలు అయ్యే వరకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయా పార్టీల నాయకులు, యువకులు బీజేపీలో చేరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, అసెంబ్లీ ప్రభారి కనిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, పార్లమెంట్ కోకన్వీనర్ అమరేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పాండుగౌడ్, కేపీ రాజు, కౌన్సిలర్ శ్రీదేవి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా నాయకుడు నవీన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, నాయకులు రాజేందర్‌రెడ్డి, నందు, రాజు, శ్రీకాంత్, వడ్ల నందు, కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ధారూర్ మాజీ ఎంపీపీ రాజునాయక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శిరీష, యువ మోర్చా అధ్యక్షుడు చరణ్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, జిల్లా కోశాధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

100% పనులు కల్పించండి

- కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: ఉపాధి హామీ పథకం కూలీలకు వంద శాతం పనులు కల్పించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. వేసవిలో వ్యవసాయ పనులు ఉండవని కూలీలందరికీ పనులు కల్పించి ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున అనారోగ్యంతో ఉన్న కూలీలను పనిలోకి తీసుకోరాదని సూచించారు. మధ్యాహ్నం వరకే పనులు చేపట్టాలని ఆదేశించారు. పని ప్రదేశంలో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

తాగునీటి సమస్య రావొద్దు

జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య వస్తే 24 గంటల్లోపు పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓలు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో మాట్లాడి పెండింగ్ పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డీఈఓ రేణుకాదేవి, ఎంపీడీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు అన్ని చర్యలు

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోలుపై సోమవారం పౌరసరఫరాల శాఖ అధికారులు, తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం సేకరణకు 122 కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. అవసరాల మేరకు మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించరాదని, ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. 2023 – 24 వానా కాలం పంటకు సంబంధించిన సీఎంఆర్‌ను వెంటనే ఎఫ్‌సీఐకి చేరేలా చూడాలని ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ అధికారులు, తహసీల్దార్లు రైస్ మిల్లులను సందర్శించాలని సూచించారు. రోజువారి మిల్లుల సామర్థ్యం మేరకు సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, రాహుల్ శర్మ, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణ బాయి, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ ఖేల్ ఖతం

- మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి లోక్‌సభ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

తుర్కయంజాల్: తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ ఖేల్ ఖతం.. దుకాణం బంద్ అని, ఆ పార్టీ బీఫామ్ ఇస్తామని వెంట పడినా నాయకులు పారిపోయే పరిస్థితి నెలకొందని మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎద్దేవా చేశారు. మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారం ఉన్న రోజుల్లో కేసీఆర్ అహంకారంతో ప్రవర్తించారని, అధికారం కోల్పోయిన 100 రోజుల్లోనే ఆ పార్టీ కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 88 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతో 12 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని అన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో పోలీసుల సాయంతో, ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి రూ.300 కోట్ల వరకు పంపిణీ చేశారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల పాటు అధికారంలో ఉండి పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడిందని దుయ్యబట్టారు. ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీకి 200 సీట్లు కూడా రావడం కష్టమేనని, ఇప్పటికే అనేక సర్వేల్లో ఇది తేటతెల్లమైందన్నారు. తనపై నమ్మకం ఉంచి పోటీ చేసే అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని, ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పార్టీ భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల శాఖ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, జెడ్పీటీసీ భూపతిగళ్ల మహిపాల్, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, లక్ష్మీపతిగౌడ్, ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి, కొంతం వెంకట్ రెడ్డి, ఎల్మటి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య



వినతిపత్రం అందజేస్తున్న చంద్రయ్య

కొడంగల్: తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బున్న చంద్రయ్య అన్నారు. సోమవారం ఆయన ఐసీడీఎస్ సిబ్బందికి సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లకు ఉద్యోగ విరమణ సాయం రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష అందజేయాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు దాటిన తర్వాత వీఆర్ఎస్ తీసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి..

యువకుడి దుర్మరణం



ప్రసాద్ మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చమ్‌దాన్ కోటకు చెందిన బంగారి ప్రసాద్(30) హైదరాబాద్‌లో ఉంటూ క్యాటరింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మీర్‌పేట్‌లో క్యాటరింగ్‌కు వెళ్లిన ఆయన పనులు ముగిశాక కుర్మల్‌గూడలోని అత్తగారింటికి వెళ్తున్నాడు. ఎంవీఎస్ఆర్ కళాశాల వద్ద బైక్ అదుపుతప్పడంతో కల్వర్టును ఢీకొట్టి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయాలవ్వడంతో ఘటనాస్థలిలోనే మృతి చెందినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గంజాయి తరలిస్తున్న యువకుడి రిమాండ్



పోలీసుల అదుపులో నిందితుడు

ఇబ్రహీంపట్నం రూరల్: గంజాయి తరలిస్తున్న ఓ యువకుడుని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సోమవారం ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మారయ్య తెలిపిన ప్రకారం.. యాదాద్రి జిల్లా నారాయణపురం మండలం కడీలబాయి తండాకు చెందిన కాట్రోత్ రాకేశ్(19) మున్సిపల్ కేంద్రంలో అద్దెకుంటున్నాడు. గంజాయికి అలవాటు పడిన యువకుడు మార్కెట్‌యార్డులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకుని విచారించగా రెండు ప్లాస్టిక్ కవర్లలో 150 గ్రాముల గంజాయిని లభ్యమైంది. ఇంజనీరింగ్ విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు తెలపడంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కబ్జా చేస్తే కఠిన చర్యలు



చెరువు కట్టను తవ్విన ప్రదేశం



నాగిరెడ్డి చెరువును పరిశీలిస్తున్న ఏఈ నవీన్

ఇరిగేషన్ ఏఈ నవీన్

పెద్దేముల్: చెరువులను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కోట్‌పల్లి ప్రాజెక్టు ఇరిగేషన్ ఏఈ నవీన్ హెచ్చరించారు. జనగాం శివారులోని నాగిరెడ్డి కుంట కబ్జాకు గురవుతుందని కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు అందింది. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఏఈ రైతులతో కలిసి కుంటను పరిశీలించారు. చెరువును తవ్వింది వాస్తవమేనని, ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, తవ్విన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వారి ఆదేశాలతో చెరువును సర్వే చేయిస్తామని వెల్లడించారు. సుమారు 19 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు కబ్జాకు గురై, మూడు ఎకరాలకు కుంచించుకుపోయిందని ఈ సందర్భంగా కొందరు రైతులు ఏఈ దృష్టికి తెచ్చారు. గ్రామానికి తలమానికం అయిన కుంటను కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారుల తనిఖీల్లో.. ఆభరణాలు

29.2 తులాల బంగారు, 3.12 కిలోల వెండి స్వాధీనం



పట్టుబడిన బంగారు, వెండి ఆభరణాలను చూపుతున్న ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్

ధారూరు: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అధికారుల తనిఖీల్లో డబ్బు, నగలు భారీగా పట్టుపడుతున్నాయి. ఆదివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో 29.2 తులాల బంగారు, 3.12 కిలోల వెండి ఆభరణాలు లభ్యమయ్యాయి. ఇందుకు సంబంధించి సోమవారం ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి తాండూరు ప్రయాణిస్తున్న ఓ కారులో బంగారు, వెండి ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. తాండూరుకు చెందిన మహవీర్ కారులో రూ.18.14లక్షల విలువైన బంగారు, రూ.2.11లక్షల విలువైన వెండి ఆభరణాలను గుర్తించామని.. సరైన ఆధారాలు చూపకపోవడంతో సోమవారం జిల్లా ట్రెజరీలో డిపాజిట్ చేశామన్నారు.

వివాహ ఆర్డర్ల నేపథ్యంలో ఆభరణాల తరలింపు

ఈనెల 19న జరుగనున్న వివాహాలకు సంబంధించిన ఆర్డర్లు నగరం నుంచి చేయించి తీసుకొస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పెళ్లిళ్లకు ఆర్డర్ ఇచ్చిన వారు ఆందోళనకు గురైనట్లు తెలిసింది.

రూ.2 లక్షలు సీజ్

తాండూరుకు చెందిన ఖాజా షయిఐన్ పటేల్‌కు చెందిన కారులో ఆదివారం తనిఖీ చేపట్టగా రూ.2 లక్షలు పట్టుబడ్డాయి. నగదుకు తగిన ఆధారాలు చూపకపోడంతో సీజ్ చేశామని ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



ఆలయ చైర్మన్ హన్మంతరావుతో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ

యాలాల: మండల పరిధిలోని జుంటుపల్లి రామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవ ఏర్పాట్లు చకచకా కొనసాగుతున్నాయి. సోమవారం డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన వసతి ఏర్పాట్లు తదితర అంశాలను ఆలయ చైర్మన్ హన్మంతరావు అడిగి తెలుసుకున్నారు. పొరుగు జిల్లాతో పాటు కర్ణాటక నుంచి భారీగా రామ భక్తులు ఉత్సవాల్లో మొక్కులు చెల్లించేందుకు వస్తుంటారని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వాహనాల పార్కింగ్, కోనేరు సమీపంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. డీఎస్పీ వెంట రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ శంకర్ తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

డీఆర్‌డీఏ ఏపీడీ సూర్యారావు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీడీ సూర్యారావు

కేశంపేట: మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడీ) సూర్యారావు అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. రైతులు వరి ధాన్యం తడి లేకుండా ఆరబెట్టి మద్దతు ధర పొందాలని సూచించారు. వరి ధాన్యం ఏ-గ్రేడ్‌కు రూ.2,203, సాధారణ రకం రూ.2,183 చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించిందని చెప్పారు. ధాన్యం విక్రయించే రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లు అందజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అజీంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శిరీష, ఎంపీఓ నర్సింలు, ఏపీఎం భగవంతు, భాగ్యలక్ష్మి, సుగుణమ్మ, గీత, చంద్రకళ, సావిత్రి, సూర్యకళ, లక్ష్మణ్, యాదగిరి పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

డీఎస్పీ భార్య ఆందోళన

- కుటుంబ సభ్యులతో కలిసి భర్త ఇంటి ఎదుట నిరసన



భర్త ఇంటి ఎదుట బైఠాయించిన జ్యోతి

తుర్కయంజాల్: 'నా భర్త నాకు కావాలి.. నా పిల్లలు నాకు కావాలి.. నాకు న్యాయం చేయాలి' అంటూ ఓ మహిళ.. భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన సంఘటన సోమవారం తుర్కయంజాల్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నాగార్జునసాగర్‌కు చెందిన రంగనాథ్‌నాయక్ మెదక్ ఏఆర్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. 2007లో మిర్యాలగూడకు చెందిన జల్లావత్ జ్యోతితో ఇతనికి వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలుండగా ప్రస్తుతం హాస్టల్‌లో చదువుకుంటున్నారు. 2018నుంచి తుర్కయంజాల్‌లో నివాసం ఉంటున్న రంగనాథ్ దంపతుల మధ్య నెలకొన్న మనస్పర్థలతో 2021నుంచి గొడవలు జరుగుతున్నాయి. గతేడాది నవంబర్‌లో పుట్టింటికి వెళ్లిన జ్యోతి నల్లగొండ ఉమెన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగా సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి తుర్కయంజాల్ చేరుకున్న జ్యోతి ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. రంగనాథ్‌నాయక్ ఆమెను అడ్డుకోవడంతో ఇంటి ఎదుట బైఠాయించి నిరసన తెలిపింది. అనంతరం 100కు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న ఆదిబట్ల పోలీసులు రంగనాథ్‌తో చర్చించారు. దీంతో ఆయన భార్యను ఇంట్లోకి అనుమతించారు. తన భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, విడాకులు ఇవ్వాలంటూ వేధిస్తున్నాడని జ్యోతి ఆరోపించింది.

చీరలు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

కారు, రూ.లక్ష విలువ చేసే చీరలు స్వాధీనం

యాచారం: హైదరాబాద్ నుంచి నల్గొండ జిల్లా దేవరకొండకు కారులో అక్రమంగా తరలిస్తున్న చీరలను యాచారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ శంకర్‌కుమార్ తెలిపిన ప్రకారం.. దేవరకొండకు చెందిన కోటేశ్ సోమవారం మధ్యాహ్నం తన కారులో రూ.లక్ష విలువ జేసే చీరలను దేవరకొండకు తరలిస్తున్నాడు. వాహనాల తనిఖీల్లో భాగంగా చీరలు లభ్యమవ్వడంతో పోలీసులు విచారించగా సరైన వివరాలు చెప్పలేదు. దీంతో కారుతో పాటు చీరలను స్వాధీనం చేసుకున్న పోలీసులు కోటేశ్‌పై కేసు నమోదు చేశారు.

చిరుగుతున్న భూ చరిత్ర

రెవెన్యూ రికార్డుల భద్రతకు ఇబ్బంది పడుతున్న సిబ్బంది

- నేటికీ కంప్యూటరీకరణ కరువు



కొత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో పేరుకుపోయిన ఫైళ్లు

కొత్తూరు: ప్రస్తుతం సాంకేతికత అన్ని రంగాల్లో కొత్త పుంతలు తొక్కుతోంది. ఇప్పటికే ప్రైవేట్ సంస్థలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు తమ పరిధిలోని ఏళ్ల క్రితం నుంచి ఉన్న పాత రికార్డులను స్కానింగ్ చేసి ఆన్‌లైన్‌లో భద్రపరుస్తున్నారు. దీంతో ప్రజలు, రైతులు ఆయా రికార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే నిమిషాల వ్యవధిలో వారికి అందించే అవకాశం ఉంది. తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డులు ఆన్‌లైన్ లేకుంటే రైతులు దరఖాస్తు చేసుకున్న రికార్డులను వెతకడానికే ఇద్దరు సిబ్బందిని కేటాయించాలి. కాగితాల కట్టల్లో ఉన్న రికార్డులు ఒక్కోసారి రోజుల తరబడి వెతికినా దొరకవు. ప్రతీ సారి రికార్డులు తీయడం.. జిరాక్స్‌లు తీయిస్తుండడంతో చిరిగిపోతున్నాయి.

రికార్డులకు భద్రత కరువు

ఇప్పటికీ మండలంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులకు భద్రత కరువైంది. తహసీల్దార్ కార్యాలయంలో విలువైన పొలాలకు సంబంధించిన ఏళ్లనాటి రికార్డులను పిచ్చికాగితాల్లా పేర్చుతున్నారు. బట్టల్లో చుట్టి బెంచీలు, కట్టెల స్టాండ్లు, కుర్చీలపై నిల్వచేస్తున్నారు. రికార్డులు అవసరమైన ప్రతిసారి కట్టల్లో నుంచి కాగితాలను వెతుకుతుండడంతో ప్రతులు చిరుగుతున్నాయి. చిరిగిన అసలు ప్రతులను సిబ్బంది అంతగా పట్టించుకోకపోవడంతో ముక్కలు, ముక్కలుగా విడిపోయి బయటకు చేరుతున్నాయి.

స్కాన్‌చేసి భద్రపరచాలి



ఇప్పటికైన తహసీల్దార్ కార్యాలయంలోని పాత రికార్డులను స్కానింగ్ చేసి ఆన్‌లైన్‌లో భద్రపరచాలి. పబ్లిక్ డొమైన్‌లో కాకుండా అఫీషియల్ సైట్‌లో భద్రపరిస్తే రైతులు, భూ యాజమానులకు ఇబ్బందులుండవు. దరఖాస్తు చేసుకుంటే వెంటనే రికార్డులు ఇచ్చే అవకాశం ఉంటుంది.

– జి.సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు, కొత్తూరు

ఆన్‌లైన్‌లో లేవు



ధరణి ప్రారంభానికి ముందు అధికారుల సూచన మేరకు పొలాలకు సంబంధించిన కొన్ని రకాల రికార్డులను స్కాన్ చేశాం. ప్రస్తుతం ధరణి వెబ్‌సైట్‌లో ఆర్ఓఆర్, పహాణీల కోసం దరఖాస్తు చేసుకుంటే ఇస్తున్నాం. పాత రికార్డుల వివరాలు స్కాన్‌చేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చలేదు. పాత రికార్డులను దరఖాస్తుదారులకు ఇవ్వడానికి జిరాక్స్ తీయిస్తుండడంతో చిరిగిపోతున్నాయి. అయినప్పటికీ సిబ్బంది రికార్డులను సక్రమంగానే భద్రపరుస్తున్నారు.

– రమేందర్‌రెడ్డి, తహసీల్దార్, కొత్తూరు

తాళం వేసిన ఇంటికి కన్నం

20 తులాల బంగారు ఆభరణాలు మాయం

యాచారం: తాళం వేసిన ఇంటికి గుర్తు తెలియని దుండగులు కన్నం వేశారు. ఈ ఘటన మండల పరిధిలోనలి గునుగల్ గ్రామంలో చోటు చేసుకుంది. యాచారం సీఐ శంకర్‌కుమార్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ రఫీ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి నల్గొండ జిల్లా పీఏపల్లిలో బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చే వరకు ఇంటి తలుపులు తెరిచి.. బీరువా డోర్లు తీసి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి యాచారం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. 20 తులాల బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ముచ్చర్లల్లో రెండు ఇళ్లలో చోరీ..

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముచ్చర్ల గ్రామంలో ఆదివారం రాత్రి రెండు ఇళ్లల్లో చోరీ జరిగింది. సోమవారం ఫార్మాసిటీ సీఐ నర్సింహరావు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కె.శ్రీశైలం కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రాత్రి ఇంటి మేడపై నిద్రించారు. తెల్లవారుజామున కిందకి దిగి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. గుర్తు తెలియని దుండగులు కిలోకు పైగా వెండి, తులం బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రాత్రి గ్రామానికి చెందిన సుగుణమ్మ నగరంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. దుండగులు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో 15 తులాల వెండి ఆభరణాలు, రూ.30వేలు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఉదయం ఘటనా స్థలాలు పరిశీలించామని.. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఏడు సెల్‌ఫోన్లు, రూ.20వేల నగదు స్వాధీనం

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ ఇంట్లో పేకాడుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు పేకాటస్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని ఎస్ఎస్ఆర్ నగర్‌లో ఓ ఇంట్లో పేకాడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఓటీ బృందం దాడి చేసి వరికుప్పల వెంకటేశ్వర్లు(42), గొల్లపోతు బాబు(38), కుమంచ సురేందర్(27), ఎల్వర్తి ఏడుకొండలు(43), వల్లపు సుబ్బారావు(38), అవ్వగిరి భుజంగరావు(39)ను అరెస్టు చేశారు. వారి వద్ద రూ.20,440 నగదు, ఏడు సెల్‌పోన్లు, రెండు పేకాట సెట్లు స్వాధీనం చేసుకున్నారు.

ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

సెక్టోరల్ అధికారుల శిక్షణలో ఆర్డీఓ శ్రీనివాస్‌రావు



సెక్టోరియల్ అధికారులతో సమావేశమైన ఆర్డీఓ శ్రీనివాస్ రావు

తాండూరు టౌన్: పార్లమెంటు ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తాండూరు ఆర్డీఓ, సహాయ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రావు అన్నారు. సోమవారం ఆయన తాండూరు అసెంబ్లీ సెగ్మెంటుకు కేటాయించిన 28 మంది సెక్టోరల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. మే 13న జరిగే ఎన్నికలకు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ సిబ్బందికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. తాగునీరు, విద్యుత్ సదుపాయం, టెంటు, ర్యాంపు తదితర వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, పకడ్బందీగా జరిగేందుకు సెక్టోరియల్ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఏఓ లావణ్య, డిప్యూటీ తహసీల్దార్ లలిత తదితరులు పాల్గొన్నారు.

'కొండా'కే సంపూర్ణ మద్దతు



కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

- మాదిగలకు అన్యాయం చేసిన కాంగ్రెస్‌ను ఓడిస్తాం
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ

తాండూరు టౌన్: ఎస్సీ వర్గీకరణకు అంగీకరించిన బీజేపీ లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికే మా సంపూర్ణ మద్దతుంటుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కె.మల్లికార్జున్ మాదిగ అన్నారు. సోమవారం సంఘం మండల అధ్యక్షుడు శేఖర్ అధ్యక్షతన పట్టణంలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ (మహాజన సోషలిస్ట్ పార్టీ) సంఘం కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. మాదిగలకు అండగా ఎస్సీ వర్గీకరణకు మద్దతు ప్రకటించిన బీజేపీ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించని కాంగ్రెస్‌ను ఓడించి తీరుతామన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశానుసారం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుకోసం పనిచేస్తామన్నారు. ప్రతి మండలంలో ప్రచార కమిటీలను ఏర్పాటు చేసి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రచారం చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు నర్సింహులు, ప్రకాశ్, స్వామిదాస్, మహేందర్, గోపాల్, సూర్యప్రకాశ్, సుభాష్, శ్రీనివాస్, పరుశురాం, ప్రవీణ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటుతో బుద్ధి చెబుదాం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రాష్ట్రాన్ని దోచిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు ఎలా బుద్ధి చెప్పారో బీజేపీ పార్టీ సైతం అదే తీర్పు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ షాద్‌నగర్, ఫరూఖ్‌నగర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ మతం పేరిట రాజకీయాలు చేస్తూ కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు రాబట్టాలని చూస్తోందని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ధరల భారంతో పేదలను ఇబ్బంది పెడుతోందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పార్టీ లోక్‌సభ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో పార్లమెంట్‌కు పంపించాలన్నారు. ఇందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయిలో చురుగ్గా పనిచేసి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ఏనాడు పదవుల కోసం పాకులాడలేదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే కేసీఆర్, కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, బాబర్‌ఖాన్, యాదయ్య యాదవ్, బాల్‌రాజ్‌గౌడ్, అగ్గనూరు విశ్వం, చెంది తిరుపతిరెడ్డి, రఘు, జమ్రుద్‌ఖాన్, ఇబ్రహీం, జితేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఖదీర్, ముబారక్, రాజేందర్‌రెడ్డి, విశాల, తదితరులు పాల్గొన్నారు.

గురుదేవికి 'తెలుగు వెలుగు'



గురుదేవి దంపతులను సన్మానిస్తున్న సాహితీ వేదిక సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయురాలు గురుదేవికి తెలుగు వెలుగు జాతీయ పురస్కారం వరించింది. సోమవారం నగరంలోని త్యాగరాయ గానసభలో తెలుగు వెలుగు సాహితీ వేదిక మహానంది జాతీయ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందజేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన ఉపాధ్యాయురాలు గురుదేవిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, సాహితీ వేదిక గౌరవ అధ్యక్షుడు శాంతికృష్ణ అవార్డు అందజేసి గురుదేవి దంపతులను ఘనంగా సన్మానించారు.